ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

నాగోలు: ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. శనివారం రాచకొండ పరిధిలోని ఉప్పల్ సెయింట్ జాన్ హైస్కూల్ నుంచి 39 మంది విద్యార్థులు పిల్లలు ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించగా రోడ్డు భద్రతా, నిబంధనల వీడియోలు ప్రదర్శించారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మజీద్‌పూర్, ఎల్‌బీనగర్, ఉప్పల్ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో 579 మంది విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను ప్రదర్శిస్తూ టీటీఐ ఆర్‌ఎస్‌ఐ సంతోష్ కుమార్, ఎస్‌ఐ నర్సింహారావు, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్ అవగాహన కల్పించారు.

మలక్‌పేట అభివృద్ధే లక్ష్యం

మలక్‌పేట: మలక్‌పేట అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, రూ. 74.32 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. పంజేషా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడారు. ఆరు డివిజన్లలో సీసీ, బీటీ రోడ్లు, కమ్యూనిటీహాళ్లు, పార్కులు, ఫుట్‌పాత్ ఇతర పనుల కోసం రూ.15 కోట్లు, ప్రత్యేక జీవో ద్వారా ఆస్మాన్‌గఢ్‌లో తాగునీటి కోసం రిజర్వాయర్ నిర్మాణాకి రూ.16 కోట్లు, కొత్త సీవరేజ్ పైపులైన్, వాటర్ పైపులైన్ కోసం రూ.6 కోట్లు, 33/ 11 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు రూ. 15. కోట్లు, 11కేవీ కవర్డ్ కండక్టర్ (25 కిలో మీటర్ల) కోసం రూ.4 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. 33 కేవీ అండ్ 11 కేవీ అండర్ గ్రౌండ్ కెబ్లింగ్ కోసం రూ.15 కోట్లు, మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో సీటీ స్కాన్, ఎండోస్కోపీ, ఎక్స్‌రే యూనిట్, రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ పరికరాలు, ఇతర సౌకర్యాల కల్పనకు 3.32 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వేగవంతంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు.

లంబోదరుడి లడ్డూలు చోరీ

వనస్థలిపురం: ఓ వైపు వాడవాడలా గణేష్ మండపాల వద్ద గణనాథులు పూజలు అందుకుంటుండగా మరోవైపు లడ్డూలను ఎత్తుకెళ్తున్నారు. మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధి హస్తినాపురం విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో శుక్రవారం నాలుగు మండపాలలో గణపతి లడ్డూలను ఎత్తుకెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలోకి స్కూటీపై వచ్చిన యువకులు రోడ్డు నెం .4లోని కేఎస్‌ఆర్ రెయిన్‌బో అపార్ట్‌మెంట్, ఎలివేట్ హోమ్స్ అపార్ట్‌మెంట్, కాలనీలోని మరో రెండు మండపాలలో చొరబడి నాలుగు లడ్డూలను ఎత్తుకెళ్లారు. గణనాథుల వద్ద పూజలు అందుకున్న లడ్డూలను చివరిరోజు తాము కైవసం చేసుకుందామని అనుకున్నామని, అలాంటి లడ్డూలు దొంగలపాలు కావడం ఆవేదన కలిగిస్తోందని భక్తులు పేర్కొన్నారు. లడ్డూ చోరీపై అపార్ట్‌మెంట్‌వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


ప్రెస్‌కాలనీలోని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జక్కిడి రఘువీర్‌రెడ్డి


కొత్తపేటలో వినాయకుడి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్


పోలీసు అధికారులను సత్కరించిన శ్రీవినాయక ఫ్రెండ్స్ అసోషియేషన్ ప్రతినిధులు


పంతులు కరుణాకర్ మండపంలో పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి


పీఅండ్‌టీ కాలనీలో విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


కుర్మగూడ అపార్ట్‌మెంట్‌లో..


ఏకదంతా.. నీవే జగమంతా

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో వినాయక నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆయా పరిధిల్లోని మండపాల్లో కొలువుదీరిన గణపయ్యలకు ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయా మండపాల్లోని గణపయ్యలను దర్శించుకుంటున్నారు.

\- ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


మారుతినగర్‌లో వినాయకుడి పూజలో పాల్గొన్న నాయకులు బొగ్గారపు శరత్‌చంద్ర


పూజలో పాల్గొన్న రాంరెడ్డి, ఆనంద్‌రెడ్డి


వినాయకనగర్ కాలనీలోని విజయ వినాయక స్వామి ఆలయంలో..


కుర్మగూడ హనుమాన్ దేవాలయంలో..


బీఎన్‌రెడ్డినగర్‌లో: గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మొద్దు లచ్చిరెడ్డి


ఆర్‌కేపురంలో గణనాథుడి దర్శించుకున్న కేఎల్‌ఆర్, దేప భాస్కర్‌రెడ్డి


ఆర్‌కేపురంలో శ్రీ వైష్ణవి నక్షత్ర అపార్ట్‌మెంట్‌లో ..


టెలిఫోన్ కాలనీలో ట్రాయింగల్ యాత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఈ లడ్డూ వేలం.. ప్రత్యేకం



చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో గత 60 సంవత్సరాలుగా వినాయ చవితి ఉత్సవాల్లో భాగంగా గణపతి విగ్రహం ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఈ దేవాలయంలో ప్రతిష్ఠించే లడ్డూకు ఓ ప్రత్యేకత ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆంజనేయ స్వామి గర్భగుడిలో, సాయంత్రం నుంచి గణపతి విగ్రహం చేతిలో పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో ప్రతియేట భక్తులు ఈ లడ్డూ సొంతం చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తుంటారు. లడ్డూ వేలం వేయకుండానే కమిటీ నిర్ణయించిన విధంగా భక్తులు కైవసం చేసుకోవడం మరో విశేషం. చవ్వ సతీష్, సహదేవ్‌యాదవ్, యశువర్ధన్, దాసరి శ్యామ్, బర్ల శ్రవణ్‌కుమార్, సత్యనారాయణ, సాయిబాబా, సురేందర్, బాలాజీ, చవ్వ అనిల్, లక్ష్మీనారాయణ, మాణిక్‌ప్రభు, మహేష్, వినయ్‌కిషోర్‌యాదవ్, సుభాష్, బండ వెంకట్‌రెడ్డి, నాగరాజు, బండారు వినయ్, ప్రమోద్, రాకేష్, సందీప్, బస్తీ యువకులు కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. నిమజ్జనం రోజు బ్యాండ్, డీజేలు లేకుండా పెద్ద సంఖ్యలో భజనలతో కుర్మగూడ బస్తీలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

సైదాబాద్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు ఇళ్లు, పాఠశాలలు, కార్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటాలని శ్రీవిజ్ఞాన వర్ధిని ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వీరేంద్రబాబు యాదవ్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలనే సూచన మేరకు శనివారం సైదాబాద్ మాతృశ్రీ కాలనీలోని పాఠశాల ప్రాంగణంలో ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వీరేంద్రబాబు యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు తాము నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటి అవి వృక్షాలుగా ఎదిగేలా చేస్తే వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు.


విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన వీరేంద్రబాబు యాదవ్

మంజూషకు డాక్టరేట్



చైతన్యపురి: మహిళా ఆరోగ్యం-శిశుపోషణపై చేసిన పరిశోధనకు కొత్తపేటకు చెందిన లెక్చరర్ మంజూషకు డాక్టరేట్ ప్రదానం చేశారు. చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ నుంచి ఎన్‌హెచ్‌ఎస్-5 ఆధారంగా మహిళల రక్తహీనత, పిల్లల పోషకాహార లోపం ప్రబలత, గణాంక నమూనా విశ్లేషణ అనే అంశంపై గణాంక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ ప్రణయ్ మార్గ నేతృత్వంలో చేసిన పరిశోధనకు యూనివర్సిటీ చాన్సలర్ పురుషోత్తం రెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు మంజూష తెలిపారు.

రహదారులపై నీరు నిల్వకుండా చర్యలు

చైతన్యపురి: కాలనీల్లోని రహదారులపై వర్షపు నీరు ఆగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధి దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద జరుగుతున్న వరదనీటి డ్రైన్ పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గతంలో చిన్నపాటి వర్షానికే బస్ డిపో నుంచి రాజధాని థియేటర్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు రహదారిపై ప్రవహించేదన్నారు. డ్రెయిన్ లైను చిన్నదిగా ఉన్న ప్రాంతాల్లో ఆధునీకరించి వెడల్పు చేయటం జరుగుతందన్నారు. ఈ పనులు పూర్తయితే సమస్యల శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తోటమహేష్ యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశ్వర్, రోజా, పద్మిని, భాస్కర్ పాల్గొన్నారు.


కాలువ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



చాదర్‌ఘాట్: సెప్టెంబర్ 1న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిచనున్న పాత పెన్షన్ సాధన పోరాట సభను విజయవంతం చేయాలని టీఎన్‌జీఓ ప్రెసిడెంట్ చిలుక నర్సింహారెడ్డి కోరారు. శనివారం మార్కెట్ కార్యాలయ ఉద్యోగులతో కలిసి ఆయన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పెన్షన్ సాధన కోసం నిర్వహించే ఈ సభకు తెలంగాణ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

కృష్ణమూర్తి సేవలు మరువలేనివి

చాదర్‌ఘాట్: హైదరాబాద్ మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసిన వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి సేవలు మరువ లేనివని చైర్ పర్సన్, వైస్ చైర్మన్ లక్ష్మి, కోట్ల శ్రీనివాస్ కొనియాడారు. శనివారం కృష్ణమూర్తి పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ చెకొలేకర్ లక్ష్మి మాట్లాడుతూ.. కృష్ణమూర్తి మార్కెట్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అన్నారు. ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కృష్ణమూర్తి సేవలు భవిష్యత్‌లో మార్కెట్ అభివృద్ధికి ఉపయోగించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖరమ్, సుల్తానా, చెకొలేకర్ శ్రీనివాస్, పుష్ప, మాధురి, పవన్ పాల్గొన్నారు.


కృష్ణమూర్తికి రిటైర్ బెనిఫిట్స్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

రక్షణ గేట్ల తొలగింపును అడ్డుకున్న కాలనీవాసులు


అధికారులను అడ్డుకున్న కాలనీవాసులు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతీ నగర్ కాలనీ ఆదర్శకాలనీగా పోలీస్‌శాఖ అధికారులతో గుర్తింపు పొందింది. కాలనీలో తరచూ చోటు చేసుకుంటున్న నేరాలు తగ్గించటానికి, కాలనీవాసుల రక్షణ కోసం 2011లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీకి సరిహద్దులో 8 రక్షణ గేట్లను ఏర్పాటు చేసి ఓ వాచ్‌మెన్‌ను నియమించారు. రక్షణ గేట్లను రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మూసి వేస్తారు. అలాగే కాలనీ మొత్తం సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసారు.దీంతో ఐదు సంవత్సరాల క్రితం సరస్వతీనగర్ కాలనీని నగర పోలీస్ కమిషనర్ ఆదర్శ కాలనీగా గుర్తించి ప్రశంసించారు. అయితే ఈ కాలనీ రక్షణ గేట్ల ద్వారా తనకు ఇబ్బందిగా ఉందని వేరే కాలనీకి చెందిన వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం సంతోష్ నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సిబ్బంది, ఒక జేసీబీతో గేట్లను తొలగించడానికి కాలనీ వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. న్యాయస్థానంలో మా వాదనలు కూడా వినిపిస్తామని, కాలనీవాసుల సంక్షేమం కోసమే గేట్లు ఏర్పాటు చేశామని వెంటనే వెనుదిరగాలని కోరడంతో చేసేదేమి లేక టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, వినోద్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మలక్‌పేట: డ్రగ్స్‌కు అలవాటు పడితే జీవితం అంధకారం అవుతుందని మలక్‌పేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నయ్య అన్నారు. ఇంటర్మీడియేట్ విద్యా కమిషనర్ క్రిష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు శనివారం విద్యార్థులకు డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకూడదని, క్రమశిక్షణతో కూడిన జీవనం అలవర్చుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే శారీరక, మానసికంగా ఎన్నో సమస్యలు తలెత్తుతాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, జక్కయ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పదవీ విరమణ



మలక్‌పేట: తెలంగాణ గవర్నమెంట్ సెంట్రల్ ప్రెస్ రీడింగ్ విభాగం ఏజీఎం, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ మర్రి రవీందర్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. శనివారం అక్బర్‌బాగ్ డివిజన్‌లోని గవర్నమెంట్ ప్రెస్ బైడింగ్ సెక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అధికారి మురళీకృష్ణ హాజరై మాట్లాడారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కార్మిక సంఘం నాయకుడిగా 37 సంవత్సరాలు సేవలు అందించారన్నారు. ప్రెస్‌లోని ఆయా విభాగాలకు చెందిన కార్మికులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, యూనీస్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎన్‌యూలో అరుదైన శస్త్ర చికిత్స


మాట్లాడుతున్న సుభాష్‌చంద్రబోస్, శ్రీనివాస్

సాక్షి, సిటీబ్యూరో/మలక్‌పేట: పారాథైరాయిడ్ అడినోమా అనే అరుదైన సమస్యతో తరచు కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉందని ఏఐఎన్‌యూ వైద్యుడు సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. ఒక దఫా తొలగించినా మళ్లీ వస్తున్నాయని ఇలాంటి కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడించారు. సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన 29 ఏళ్ల యువతికి పదేపదే కిడ్నీలో రాళ్లు ఏర్పడుతున్నాయి. వైద్య పరీక్షలు నిర్వహించగా ఆమెకు మెడలో పారాథైరాయిడ్ ఎడినోమా అనే కణితి కారణంగా ఇలా జరుగుతోందని గుర్తించామన్నారు. దీని వల్ల పారాథైరాయిడ్ హార్మోన్ అధికంగా ఉత్పత్తి అవుతుంది, రక్తంలో క్యాల్షియం స్థాయి పెరిగిపోతుంది. ఫలితంగా కిడ్నీలో మళ్లీమళ్లీ రాళ్లు ఏర్పడి మూత్రం బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఇది చాలా విభిన్నమైన కేసు అని శస్త్రచికిత్సలతో దశలవారీగా రాళ్లకు తొలగించామన్నారు.

పేరుకుపోయిన చెత్తను తొలగించాలి


చెత్తను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. పీవీఆర్, వేంకటేశ్వర,పద్మావతి కాలనీల్లో శనివారం ఆయన పర్యటిస్తూ మాట్లాడారు. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో ఎక్కడ చెత్తకుప్పలు అక్కడే పేరుకుపోయి అస్తవ్యస్తంగా మారిందని, పారిశుద్ధ్య అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతిరోజు రోడ్ల శుభ్రపరచాలని, ఎప్పటికప్పుడు చెత్తకుప్పలను తొలగించాలన్నారు.

- డివిజన్ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని శనివారం కమిషనర్ ఆర్.వీ కర్ణన్‌ను మొద్దు లచ్చిరెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు.

కొనసాగుతున్న నిమజ్జనాలు

చైతన్యపురి: గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద వినాయకుడి విగ్రహాల నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుంది. నవరాత్రులు మొదలైర మూడు, అయిదు రోజులలో గణనాథులు ఆయా ప్రాంతాల నుంచి నిమజ్జనానికి తరలి వస్తుటాయి. మినీ ట్యాంక్‌బండ్‌పై ప్రస్తుం నాలుగు భారీ క్రేన్ ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో విగ్రహాలు ఊరేగింపుగా వస్తుండటంతో తిలకించటానికి వచ్చే సందర్శకులతో ట్యాంక్‌బండ్ సందడిగా మారింది. శుక్రవారం రాత్రి వరకు సుమారు 111 విగ్రహాలు (మూడు అడుగుల పైన), శనివారం సాయంత్రం వరకు 100కు పైగా విగ్రహాలు నిమజ్జనం జరిగినట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు.


సరూర్‌నగర్‌లో నిమజ్జనం కార్యక్రమం

నాగోలులో..

నాగోలు: నాగోలు చెరువు వద్ద ఉన్న కొలనులో గణేష్ నిమజ్జనాన్ని సజావుగా, సురక్షితంగా నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక ఏర్పట్లు చేశారు నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా నాగోలు సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌నాథ్ యాదవ్ కొలను సందర్శించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవద్దని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.


మినీట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేస్తున్న భక్తులు


పసుమాములలో..